# వైద్య కళాశాలల హబ్‌గా అమరావతి



విజయవాడలో అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ శంకుస్థాపన సందర్భంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి దేవినేని ఉమా, మల్లికార్జునరావు, నవనీతకృష్ణ, మంత్రులు కామినేని శ్రీనివాస్, అఖిలప్రియ

ఈనాడు, అమరావతి: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పుల్ని తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాజధాని పరిధిలో ఇప్పటికే ఉన్న.. రానున్న కొత్తవాటితో కలిపి 13 వైద్య కళాశాలలు ఉండబోతున్నాయని తద్వారా అమరావతి వైద్యకళాశాలల హబ్‌గా ఆవిర్భవించబోతోందని అన్నారు. విజయవాడలో గురువారం అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. "స్వస్థలాల నుంచి అమెరికా వంటి విదేశాలకు వెళ్లిన వైద్యులు జన్మస్థలంలో వైద్య కళాశాల ద్వారా సేవలను అందించేందుకు ముందుకు రావడం హర్షణీయం. ఈ స్ఫూర్తితో విదేశాల్లోని మిగిలిన వైద్యులు, ఇతర రంగాలకు చెందిన వారు జన్మభూమికి సేవలు అందించాలి. అమెరికన్లు ఇక్కడికి వచ్చి శస్త్రచికిత్సలు చేయించుకునే పరిస్థితులను తీసుకురావాలి. వైద్య విద్యార్థులను గ్రామాలకు పంపి వారికి క్షేత్రస్థాయిలో పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు జరిగినసమయంలో అత్యవసర చికిత్సకోసం అడ్వాన్స్ మెడికల్ సపోర్టు వాహనాలను అందుబాటులోకి తెచ్చాం" అని చంద్రబాబు వివరించారు. మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం వైపు వైద్య కళాశాల వస్తోందని అమరావతి పరిధిలోని వారికి వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తున్నాయన్నారు. మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, అఖిలప్రియ మాట్లాడారు. అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఛైర్మన్ గొర్రెపాటి నవనీత కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చామన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి సీఈఓ. కృష్ణకిషోర్ మాట్లాడుతూ 2019 నాటికి 300 పడకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 2020 నాటికి పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సంస్థకు స్థల విషయంలో సహకరించిన ఇబ్రహీంపట్నం మాజీ సర్పంచి మల్లెల పద్మనాభరావును ముఖ్యమంత్రి సత్కరించారు.